క్లుప్తంగా

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సేదతీరుతున్న పర్యాటకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం నుండి ఎండ విపరీతంగా కాయడంతో పాటు వేడి గాలులు వీస్తుండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వర స్వామి,వేలాంకణీ మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్ కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

సీబీఎస్ఈ శిక్షణా తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగనాథరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని భారతీయ విద్యా భవన్స్ స్కూల్లో వివిధ పట్టణాలకు చెందిన సుమారు 520 మంది స్కూల్ టీచర్లకు సీబీఎస్ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే, భవన్స్ చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నోబుల్ బహుమతి లాంటిదన్నారు. దేశ ప్రథమ పౌరుడైనా, ప్రధాన మంత్రి అయినా టీచర్ దగ్గర ఓనమాలు నేర్చుకోవాల్సిందేనని తెలిపారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థి అడిగిన ప్రతి సందేహాన్ని ఓపికగా నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భావన సొంకాంబే, రిసోర్స్ పర్సన్ డాక్టర్ అనురాధ బాలరామ్, ప్రిన్సిపల్ ఎల్‌వీ రమాదేవి, చెరుకువాడ నరేష్, సెక్రటరీ కృష్ణంరాజు, భవన్ సంచాలకులు డాక్టర్ బీవీ శేషగిరిరావు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహన



లెక్చరర్లకు శిక్షణ అందిస్తున్న శిక్షకులు

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కళాశాల ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిషు బోధన నూతన విద్యావిధానాన్ని అధ్యాపకులు తప్పనిసరిగా అమలు చేయాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. గత కొన్ని రోజుల నుంచి పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిషు అధ్యాపకులకు నిర్వహిస్తున్న మొదటివిడత శిక్షణ శనివారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంగ్లిషు బోధనలో మెలకువలు అధ్యాపకులు తప్పని సరిగా తెలుసుకోవాలన్నారు. ఈ శిక్షణలో ఉభయ పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 39 మంది లెక్చరర్లు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిసోర్స్‌సెంటర్ కో ఆర్డినేటర్లు, మాస్టర్ ట్రైనర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

అలాగే సోమవారం నుంచి కళాశాల అధ్యాపకులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం స్థానిక పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 17 వరకు జరిగే శిక్షణలో అధ్యాపకులు తప్పక పాల్గొని నూతన విద్యావిధానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'తణుకు'

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మొత్తం 39 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆదివారం తణుకు – జగన్నాథపురం మధ్య జరిగిన పోటీలో తణుకు విన్నర్‌గాను, జగన్నాథపురం రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా ఎంపీపీ పానుకుమాటి శేషులత మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని, క్రీడలపై యువత దృష్టి సారించాలన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేత టీమ్‌కు రూ.20వేలు నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు.

స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు వడివడిగా అడుగులు

- రూ.61.81 కోట్లుతో పైప్‌లైన్స్ ప్రక్షాళన
- 45 ఏళ్ల నాటి పాత పైప్‌లైన్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- పట్టణంలో మరో 4 ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం



భారీ విస్తీర్ణంలో ఉన్న నరసాపురం మంచినీటి కుళాయిచెరువు



పాత పైప్‌లైన్స్‌తో తరచూ మరమ్మతులు (ఫైల్)

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటుగా అదనంగా 4 ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టడానికి రాష్ట్రప్రభుత్వం గత ఏడాది ఆమోదం తెలిపిపారు. మున్సిపాలిటీలో రూ.61.81కోట్లుతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ మంజూరు చేసింది. గతేడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి టెండర్లు పిలిచి పనులు త్వరితగతిన మొదలు పెట్టడానానికి ప్రస్తుతం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రాజెక్ట్ మంజూరుతో దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. మంచినీటి చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. మునిసిపల్ లెక్కల ప్రకారం చూసుకుంటే చెరువులో అందుబాటులో ఉన్న నీటిని వేసవిలో కాలువలు కట్టేసినా కూడా పట్టణవాసులకు రెండు పూటలా 65 రోజుల పాటు అందించవచ్చు. ఈ ఏడాది కూడా అలాగే వేసవిలో రెండుపూటలా నీరందించారు.

పట్టించుకోని గత టీడీపీ పాలకులు

గతంలో భారీ మంచినీటి చెరువు ఉన్నా కుళాయిల ద్వారా సమృద్ధిగా నీళ్ళు అందని పరిస్థితి. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్స్ శిథిలమవ్వడంవల్లే వస్తోంది. పైప్‌లైన్లు బాగోలేకపోవడంతో తక్కువ ప్రెజర్‌తో నీటిని వదులుతారు. దీంతో కుళాయిల ద్వారా నీళ్లు సవ్యంగా రావు. ఒకవేళ ఎక్కువ ప్రెజర్ తో నీటిని వదిలితే పైప్‌లైన్స్‌కు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజ్‌లు ఏర్పడే పరిస్థితి ఉంది. ఇది దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్య. 1956లో మున్సిపాలిటీ ఏర్పడింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయ లేదు. పుష్కరాల సమయంలో కోట్ల నిధులు పక్క దారి పట్టించి గత టీడీపీ ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేసింది తప్ప పట్టణంలో ఇలాంటి ప్రజల దీర్ఘకాల ప్రయోజనాల మీద దృష్టి పెట్టలేదు. 1983 తరువాత నరసాపురం మున్సిపాలిటీ ఎక్కువకాలం టీడీపీ పాలనలోనే ఉండడం గమనార్హం. మొత్తానికి ఇన్నేళ్లకు ముదునూరి ప్రసాదరాజు కృషితో ఇప్పటికి మంచినీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ పట్టాలెక్కుతుంది.

మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌లు నిర్మాణం

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్ ఆర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం పట్టణంలో 96 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే. వాటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తారు. వాటిని తొలగించి కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. మళ్లీ కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలకు అదనంగా పైప్‌లైన్‌లు నిర్మించనున్నారు. నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించబోతున్నారు.

త్వరలో పనులు మొదలు



మున్సిపాలిటీలో మంచినీటి వ్యవస్థను ప్రక్షాళన చేస్తానని నేను ఎన్నికల్లో హామీ ఇచ్చాను. సమస్య శాశ్వత పరిష్కారం చూస్తేనే ఉపయోగం ఉంటుంది. విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టగానే రూ.61.81 కోట్లు మంజూరుకు ఒప్పుకున్నారు. ఇక పట్టణంలో నాణ్యమైన మంచినీటి సరఫరా జరుగుతుంది. వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేయించి పనులు త్వరితగతిన మొదలు పెట్టేలా చర్యలు చేపడతాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు ఉండవు



నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్స్ వల్లే ఇబ్బందులు ఉన్నాయి. రూ.61.81 కోట్లుతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు ఎమ్మెల్యే చొరవ చూపించారు. గతంలో ఏ ఎమ్మెల్యే ఈ విషయాన్ని పట్టించుకోలేదు. దీర్ఘకాల సమస్య తీరబోతుంది. చాలా ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌లు వేస్తారు. ఇక పట్టణంలో ఎకర్కడా మంచినీటి ఇబ్బంది అనేది ఉండదు.

– తిర్రే బాబూరావు, మున్సిపల్ రిటైర్డ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

దానేశ్వరమ్మ సేవలో శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: మాజీ మంత్రి, వైఎస్సార్ సీఈప జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు వరిగేడులోని శ్రీదానేశ్వరి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పెనుగొండ ఏఎంసీ మాజీ చైర్మన్ మేడపాటి చంద్రమౌళీశ్వర రెడ్డి, మేడపాటి చిరంజీవి రెడ్డి, తేతలి సుధీర్ రెడ్డి, తాడి రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గోపయ్య డాక్టర్ తేతలి బలరామరెడ్డి తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



పాలకొల్లు గ్రంథాలయంలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని వాటిని ఎంత ఉపయోగించుకుంటే అంత విజ్ఞానం పెరుగుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహరావు తెలిపారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు ఇతర వ్యాపకాల వైపు వెళ్లకుండా ఈ శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. విద్యార్థులు కూడా ఒకరిని చూసి ఒకరు అధిక సంఖ్యలో ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. శిక్షణా తరగతుల్లో నిర్వహించిన యోగా, క్యారమ్, చెస్, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ, నీతి కథలు, నీతి వ్యాఖ్యలు, క్విజ్, పద్యాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి, గ్రంథాలయ సభ్యులు జి.సీతారామ్, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్టేరులో

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా వివిధ విభాగాల్లో శిక్షణ పొందిన విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి, మార్టేరు ఎంపీటీసీ సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, విశ్రాంత తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి గ్రంథాలయ అధికారి పీటీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏనుగువానిలంకలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ





ధాన్యాధివాసంలో శ్రీ గణపతి శ్రీ సీతారామచంద్రస్వాముల విగ్రహాలు, విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక పంచాయతీ పల్లి పోలవరంలో నూతనంగా నిర్మించిన శ్రీ గణపతి శ్రీ సీతారామచంద్ర పరివార దేవతా నూతన ఆలయంలో సోమవారం విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమారస్వామి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్మించినట్లు ఆయన వివరించారు. ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా ఆదివారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మార్జనలు, పంచగవ్యప్రాశన, వాస్తు పూజ, వాస్తు హోమం, వాస్తు బలి, ధాన్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం పూజలు నిర్వహించి 7 గంటల 29 నిమిషాలకు విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ జరుగుతుందని కుమారస్వామి చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ముగిసిన నరసింహుని కల్యాణోత్సవాలు



కొంతేరు శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అఖండ అన్నసమారాధన

యలమంచిలి: మండంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు మాదవాచార్యులు దేవేరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి అన్నదాన కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొంతేరు పరిసర గ్రామాల నుంచి సుమారు 800 పైగా భక్తులు ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకుని, నవకాయ పిండి వంటలతో వడ్డించిన స్వామి ప్రసాదం స్వీకరించారు. ఈ అన్నసమారాధనతో ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాలు ముగిశాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ వివరించారు.

వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తుల పంపిణీ



కుప్పనపూడిలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న పీవీఎల్

ఆకివీడు: సేవా కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక ప్రాధాన్యతనివ్వాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల ద్వారానే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అన్ని విధాలుగా సేవలందించాలని సూచించారు. వలంటీర్లు చేస్తున్న సేవల్ని ప్రజలు, అన్ని పార్టీలు హర్షిస్తుంటే, టీడీపీ ఈర్ష్య చెందుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మోటుపల్లి గంగాధర రావు, మన్నే పోతరాజు, మోరా జ్యోతి, పాల్గొన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనం



కాళ్ల హైస్కూల్లో సమావేశమైన 1987-88 బ్యాచ్ విద్యార్థులు

కాళ్ల: సుమారు 36 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలిశారు. కాళ్ల హైస్కూల్‌లో 1987–88 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులు హాజరవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. వివిధ వృత్తులు ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానించారు. వయసుని సైతం పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మరొకసారి కలుద్దాం అంటూ ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు చెప్పుకున్నారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన బండారు ఫణి భోగయ్య, డి.పురుషోత్తం, గనిశెట్టి బాబ్జి, బేతు రాంబాబు, చిన్నం జాన్ మోజెస్, ముత్యం శేఖర్‌బాబు, షేక్ శ్రీను, కోటి సుబ్బారావు, గనిశెట్టి రంగారావులను తోటి విద్యార్థులు అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహ దాతలకు సత్కారం



అంబేడ్కర్ విగ్రహ దాతలను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలో అంబేడ్కర్ విగ్రహ దాతలను ఏపీ షెడ్యూల్డ్ కూలాల సంక్షేమ సంఘంలోని కాంస్య విగ్రహ కమిటీ చైర్మన్ శ్రీకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ జడ్జి నెల్సన్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సుమారు 58 మంది దాతలకు ఘన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో యాళ్ల హనోక్‌వర్ధన్, రాజేస్, కె.శ్యామలరావు, కేసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు జలకళ



యనమదుర్రు వద్ద కాళీపట్నం చానల్ కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు

భీమవరం అర్బన్: ఈ ఏడాది ఇరిగేషన్ అధికారులు జూన్ 1న ఎగువున ఉన్న కాలువలు ద్వారా నీటిని విడుదల చేయడంతో మండలంలో ప్రధాన కాలువలైన కాళీపట్నం, లోసరి, వెంప ఛానల్‌లలో సాగునీరు నిండుగా ప్రవహిస్తూ కళకళలాడుతున్నాయి. గత ఏప్రిల్‌లో కాలువలు కట్టేయడంతో గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువుల్లో నీరు లేక అడుగంటిపోయాయి. ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో చెరువులు, కాలువలు, పొలాలు ఎండిపోవడంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందస్తు సార్వా సాగు కోసం ప్రతి ఏడాది లాగే కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భీమవరం ఎంపీడీఓ వెంకటలక్ష్మి



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరవాసరం ఎంపీడీఓ జ్యోతి

సాక్షి, భీమవరం: అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచించారు. బుట్టాయిగూడెం మండలం నుంచి భీమవరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన వెంకటలక్ష్మి, కొయ్యలగూడెం నుంచి వీరవాసరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన కుంజా జ్యోతి ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. మండల పరిషత్ అధికారులు ప్రతి గ్రామాన్ని కూడా ప్రభుత్వ లక్ష్యం మేరకు అభివృద్ధి చేసే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయాలని సూచించారు. గ్రామాలలో డ్రెయినేజీ, సీసీ రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మించడం జరుగుతుందని, ఎంపీడీవో స్థానంలో ఉన్న అధికారులు ప్రతిరోజు కూడా గ్రామాలలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలి

సాక్షి, భీమవరం: రెజ్లర్లతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం చౌక్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి నాయకులు మాట్లాడారు. రెజ్లర్లపై ఎంపీ ప్రవర్తన దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఎంపీని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.బలరాం, సీహెచ్ రంగారావు, గంటా సుందర్‌కుమార్, అనపర్తి కృష్ణ ప్రసాద్, యు.సుజాత, ఆర్.జ్యోతి తదిరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

భీమవరం (ప్రకాశం చౌక్): భక్తులకు అన్నప్రసాద వితరణ మంచి కార్యక్రమం అని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. పట్టణంలోని రామరాజు తోటలో కొలువైన శ్రీచినమావుళ్లమ్మ అమ్మవారి 38వ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ నాగప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నసమారాధన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించి ముగింపు సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారి సేవా సమితి అధ్యక్షులు రామాయణం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేవూరి గోగురాజు పాల్గొన్నారు.